క్లుప్తంగా

ఏయూను సందర్శించిన ఇటలీ ప్రొఫెసర్



ప్రొఫెసర్ ఫ్లామినియా నికోరాను సత్కరిస్తున్న ఏయూ వీసీ, రిజిస్ట్రార్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని శుక్రవారం ఇటలీ దేశం బర్గామో యూనివర్సిటీకి చెందిన అంతర్జాతీయ సంబంధాల డిప్యూటీ రెక్టార్ ప్రొఫెసర్ ఫ్లామినియా నికోరా సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య జీ.పి.రాజశేఖర్‌తో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రగతిని ప్రొఫెసర్ ఫ్లామినియాకు వీసీ వివరించారు. అనంతరం ఏయూ తరపున ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు సదరన్ సర్టిఫికెట్ తప్పనిసరి



తోటగరువు భవిత కేంద్రంలో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి వెంకటశేషమ్మ

ఆరిలోవ: దివ్యాంగ పిల్లలకు సదరన్ సర్టిఫికెట్లు ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ తెలిపారు. తోటగరువు ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న దివ్యాంగ పిల్లలతో కూడిన భవిత కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. కేంద్రంలో ఎంతమంది పిల్లలున్నారు, వారికి అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. పిల్లలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటశేషమ్మ మాట్లాడుతూ భవిత కేంద్రంలోని పిల్లలకు సదరన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా చేయించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. ఈ సర్టిఫికెట్ వల్ల పిల్లలకు కలిగే లాభాలను వివరించారు. భవిత కేంద్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో చినగదిలి మండలం ఎంఈవో-2 పి.అనురాధ, పాఠశాల హెచ్‌ఎం విశ్వనాథం, భవిత కేంద్రం ఉపాధ్యాయులు మహాలక్ష్మి, సలీమ పాల్గొన్నారు.

మద్దిలపాలెం బస్ స్టేషన్‌లో తాగునీటి సౌకర్యం



బస్ స్టేషన్‌లో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న అప్పలనాయుడు

మద్దిలపాలెం: మద్దిలపాలెం ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. బలసడ జగన్నాథరావు, బలసడ బాలత్రిపుర సుందరమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు బలసడ వెంకట జనార్దన్ రూ.77 వేల విలువైన ఆర్వో వాటర్ సిస్టమ్‌ను వితరణ చేశారన్నారు. దీనిని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికులు ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ఏపీఎస్ ఆర్టీసీ ముందుంటుందన్నారు. ప్రయాణికులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి తన సొంత ఖర్చులతో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన ఆర్టీసీ విశాఖపట్నం అసిస్టెంట్ ఇంజినీర్(సివిల్) బలసడ వెంకట జనార్దన్‌ను అప్పలనాయుడు అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, మద్దిలపాలెం డిపో మేనేజర్ ఎస్.అరుణకుమారి, డీఈఈ (సివిల్) పి.వి.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

విశాఖ విద్య: పవిత్ర రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం సందర్భంగా మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆరాధకులు తమ శరీరాన్ని శుద్ధి చేసుకొని, కొత్త దుస్తులు ధరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎన్ఏడీ సెంటర్‌లోని ఎన్ఎస్‌టీఎల్ గేటుకు సమీపంలో గల తసీన్ మసీదులో ముస్లింల సందడి కనిపించింది. ఇదే చోట ఏర్పాటు చేసిన హైదరాబాద్ హలీంను తినేందుకు ముస్లింలతోపాటు జాతీయ రహదారిపై వెళ్లే వారు ఎంతో ఆసక్తి చూపారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలంతా కలసి విందు స్వీకరించారు.

మద్దిలపాలెం జంక్షన్ ఆటోల వలయంలో చిక్కుకుంది. ఇక్కడ అటు.. ఇటు ఆర్టీసీ బస్ స్టేషన్, నగరంలోకి వెళ్లే బస్ స్టాప్‌ల వద్ద నిత్యం వేల సంఖ్యలో ఆటోలు తిష్ట వేస్తున్నాయి. ట్రాఫిక్ నిబంధనలను ఆటోవాలాలు పూర్తిగా పక్కన పెట్టేసి సర్వీస్‌లు నడుపుతున్నారు. ఇతర వాహనాల రాకపోకలను ఏమాత్రం పట్టించుకోకుండా ఆటోలను అడ్డదిడ్డంగా నడపడం, నిలపడం వంటివి చేస్తున్నారు. దీంతో హైవేపై మద్దిలపాలెం జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యలు రెట్టింపవుతున్నాయి. ఈ కూడలి మీదుగా రాకపోకలు సాగించాలంటేనే వాహన చోదకులు, పాదచారులు భయపడుతున్నారు. – మద్దిలపాలెం



ఆటోలతో నిండిన మద్దిలపాలెం జంక్షన్



కళాభారతి జంక్షన్‌లో నిలిపిన ఆటోలు

జంక్షన్‌లో టెన్షన్..!

ఆటోల వలయంలో మద్దిలపాలెం కూడలి



మద్దిలపాలెం బస్ స్టేషన్ నుంచి బయటకు వచ్చే బస్సులు, స్టేషన్‌లోకి వెళ్లే ప్రయాణికులు రాకపోకలు చేయడానికి వీలు లేకుండా ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలిపివేస్తున్నారు. దీంతో బస్సులు స్టేషన్ నుంచి బయటకు వచ్చే క్రమంలో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఆటోలను దాటి వాహన చోదకులు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నాయి. ఈ క్రమంలో చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఆర్టీసీ ఆదాయానికి గండి!

మద్దిలపాలెం బస్ స్టేషన్ చుట్టూ ఆటోలు నిలిపి సర్వీస్‌లు చేయడంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది. బస్ స్టేషన్‌లో దిగి వచ్చే ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆటోవాలాలు పోటీ పడుతున్నారు. ఇదే ప్రాంతంలో శ్రీకాకుళం, విజయనగరం తదితర జిల్లాల వైపు వెళ్లే ఆటోలు ప్రయాణికులను పిలిచి సర్వీస్ చేసుకుంటున్నాయి. దీంతో ఆర్టీసీ బస్సు కంటే ముందుగా గమ్యం చేరడానికి కొందరూ ప్రయాణికులు ఆటోలు ఆశ్రయిస్తున్నారు.

రోడ్డు మధ్యలో ఆపి సర్వీస్‌లు

హైవేపై ఇసుకతోట నుంచి మద్దిలపాలెం వచ్చే మార్గంలో కళాభారతి జంక్షన్ ఎల్లప్పుడూ రద్దీగా ఉంటోంది. కళాభారతి ఆడిటోరియం నుంచి ప్రధాన రహదారికి అటు.. ఇటు కాకుండా మధ్యలో ఆటోలను ఆపి సర్వీస్‌లు చేస్తున్నారు. దీంతో నిత్యం ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. కళాభారతి వైపు నుంచి ప్రధాన రహదారికి వెళ్లే వాహనాలకు మార్గం లేకుండా పోతోంది. బండి హారన్ కొడుతున్నా.. ఆటోవాలాలు పట్టించుకోవడం లేదని వాహన చోదకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పటిష్ట చర్యలు అవసరం

మద్దిలపాలెంలో ఎక్కడికక్కడ రోడ్లపై ఆటోలను నిలిపి సర్వీస్‌లు చేయడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇతర వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. ఈ సమస్య పరిష్కారానికి ఆటోలను క్రమపద్ధతిలో నిలిపేలా, నిబంధనలు పాటించి నడిపేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని పలువురు ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.



ద్విచక్ర వాహనాలకు దారి లేకుండా రోడ్డుకు అడ్డంగా ఆటోలు

ఆటోవాలాల ఇష్టారాజ్యం

నిత్యం ఆటోలతో గందరగోళంగా ఉండే మద్దిలపాలెంలో ఆటోవాలాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ ఉండే ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద ఇష్టానుసారంగా ఆటోలు నిలిపేస్తున్నారు. దీంతో బస్సుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్లపై అడ్డదిడ్డంగా ఆటోలను ఆపి సర్వీస్‌లు చేయడం వల్ల ఇతర వాహన చోదకులు సతమతమవుతున్నారు. మద్దిలపాలెం బస్ స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందిపడేలా ఆటోలను రోడ్డుపై ఆపుతున్నారని పలువురు మండిపడుతున్నారు. ఆటోలను అడ్డంగా ఎందుకు పెట్టారని ఆటోవాలలను అడిగితే వాగ్వాదానికి దిగుతున్నారని పాదచారులు, వాహన చోదకులు చెబుతున్నారు.

ఉత్సాహంగా దిశ ఎంసీఎస్ మీట్



జ్యోతి వెలిగించి మీట్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌ఆర్ జిత, కరస్పాండెంట్ విజయ రవీంద్ర



డ్యాన్స్‌తో అలరిస్తున్న విద్యార్థినులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని సమత డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం దిశ మేనేజ్‌మెంట్, కామర్స్, సైన్స్ మీట్(ఎంసీఎస్) ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులు విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్‌ఆర్ జిత, కళాశాల కరస్పాండెంట్ ఆచార్య విజయ రవీంద్ర జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిత మాట్లాడుతూ దేశ ఆర్థిక ప్రగతిలో విద్యార్థులు భాగస్వాములుగా నిలవాల్సిన అవసరముందన్నారు. నూతన ఆవిష్కరణలు, కొత్త లక్ష్యాలు, ప్రణాళికల దిశగా విద్యార్థి దశలో ముందుకు సాగినపుడు ఉన్నత అవకాశాలు సాధ్యమవుతాయని చెప్పారు. తద్వారా దేశానికి సేవలందించే అవకాశం సైతం లభిస్తుందన్నారు. ఆచార్య విజయ రవీంద్ర మాట్లాడుతూ యువత విద్యార్థి దశలో పరిశోధనాత్మక విజ్ఞానాన్ని, వ్యాపార దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

భవిష్యత్ అవకాశాలపై అవగాహన

ఎంసీఎస్ మీట్‌లో మేనేజ్‌మెంట్, కామర్స్, సైన్స్ విద్యార్థులకు వేరువేరుగా మార్కెట్, ఫైనాన్స్, హెచ్‌ఆర్, కామర్స్, మ్యాథమెటిక్స్, సైన్స్, ఫిజిక్స్, బోటనీ, న్యూట్రిషన్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ అంశాల్లో ఈవెంట్లు నిర్వహించి అవగాహన కల్పించారు. నైపుణ్యం పెంపు, భవిష్యత్ అవకాశాలు, ప్రణాళికలను సంక్షిప్తంగా వివరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అలరించారు. మీట్‌కు ఉత్తరాంధ్రకు చెందిన 75 కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో సమత కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు, ఎంసీఎస్ మీట్ కన్వీనర్ గంటా రమేష్, కో-కన్వీనర్లు రాజేష్‌కుమార్, అనిత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు

జోన్-3 పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

ఆరిలోవ: ఏపీఈపీడీసీఎల్ జోన్-3 విశాలాక్షినగర్ కార్యాలయ పరిధిలో విద్యుత్ వినియోగానికి అవసరమైన చర్యలను అధికారులు చేపడుతున్నారు. సాధారణంగా వేసవిలో ప్రజల నుంచి విద్యుత్ వినియోగం పెరుగుతుంది. నిత్యం ఎక్కువ ఇళ్లలో ఏసీలు, ఫ్యాన్‌లు, కూలర్లు ఆన్‌లో ఉంటాయి. దీనివల్ల వినియోగం పెరిగి పాత ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ పెరుగుతుంది. దాని సామర్థ్యం తక్కువ కావడంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది. ఈ సమస్య లేకుండా ముందుగానే అవసరమైన చోట్ల కొత్తగా ఎక్కువ సామర్థ్యంతో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా సుందర్ నగర్, ఇందిరాగాంధీ నగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లో ఇటీవల కొత్తగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు విశాలాక్షినగర్ ఏఈ ఎస్.శ్వేత తెలిపారు. ఏయే ప్రాంతాల్లో ప్రజల నుంచి విద్యుత్ వినియోగం పెరుగుతుందో అలాంటి చోట్ల సామర్థ్యానికి తగిన ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చుతున్నట్లు చెప్పారు. ఇటీవల వినియోగం పెరిగిన సుందర్‌నగర్‌లో 100 కేవీ సామర్థ్యం, ఇందిరాగాంధీనగర్‌లో 100 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. రవీంద్రనగర్‌లో గతంలో ఉన్న 100 కేవీ ట్రాన్స్‌పార్మర్‌పై లోడ్ పెరగడంతో దాన్ని తొలగించి కొత్తగా 150 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చినట్లు ఏఈ తెలిపారు.

ముగిసిన లైబ్రేరియన్ల వర్క్‌షాప్



వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లైబ్రేరియన్లు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐదు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లైబ్రేరియన్ల వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కృష్ణా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ మాట్లాడుతూ వర్క్‌షాప్‌లో లైబ్రేరియన్లకు నేటి ఆధునిక ప్రపంచంలో గ్రంథాలయాల ఉపయోగాల గురించి తెలియజేశామన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 38 మంది వివిధ ప్రభుత్వ కళాశాలలకు చెందిన గ్రంథాలయాధికారులు హాజరయ్యారని చెప్పారు. ఏయూ లైబ్రరీ అండ్ ఇన్‌ఫర్మేషన్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య ధనరాజు మాట్లాడుతూ ఆటోమేషన్ ఆవశ్యకత, ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిజిటల్ రిసోర్సెస్ వినియోగాన్ని తెలియజేశారు. ఆధునిక డిజిటల్ యుగంలో గ్రంథాలయ పాత్ర గురించి వివరించారు. కార్యక్రమ రిసోర్స్ పర్సన్లు గాంధీనగర్ అహ్మదాబాద్‌కు చెందిన సైంటిస్ట్ హేమ చోలిన్, ఆర్తి సవాలే మాట్లాడుతూ గ్రంథాలయాల డిజిటలైజేషన్‌లో ఉపయోగించే సాఫ్ట్‌వేర్ గురించి పూర్తిస్థాయిలో గ్రంథాలయాధికారులకు అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమానికి ఆర్గనైజింగ్ సెక్రటరీగా కృష్ణా డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ ఎం.శ్రీనివాస ప్రసాద్ వ్యవహరించారు. కళాశాల ఎకడమిక్ అడ్వైజర్ శ్రావణ్‌కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.రవిబాబు, అకడమిక్ కో ఆర్డినేటర్ ఎం.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం

ఎంవీపీకాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు చోట్ల విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీలోని హెచ్‌డీపీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 30న ఉగాదిని పురస్కరించుకుని ఎంవీపీ కాలనీ హెచ్‌డీపీ కార్యాలయంతో పాటు అనకాపల్లి జిల్లా పాపయ్యపాలెంలోని శ్రీరామాలయం, అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలంలోని సింగరాళ్లపాడు గ్రామంలో ఈ కార్యక్రమం జరగనుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

భీమునిపట్నం: భీమిలి బీచ్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయపడ్డారు. అప్పుఘర్‌కు చెందిన సురాడ రాంబాబు(45) ద్విచక్ర వాహనంపై విశాఖకు వెళ్తుండగా భీమిలి బీచ్ రోడ్డులోని కొబ్బరిచెట్ల పార్కు వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో రాంబాబు తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా నూకాలమ్మ జాతర



నూకాలమ్మ జాతరలో డప్పు కళాకారుల సందడి

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కాలనీలో కొలువైన నూకాలమ్మ జాతర, అనుపు మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధానార్చకుడు డి.వెంకటరత్నం శర్మ భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు జరిపారు. మహిళలు పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులను సమర్పించారు. పలువురు ప్రముఖులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి శతకం పట్టు(పుట్టినిల్లు) నుంచి ఉత్సవ విగ్రహాన్ని నేల డ్యాన్సులు, థింసా, కోలాటం, పులివేషాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ బాణసంచా పేలుళ్లతో తిరువీధుల్లో ఊరేగించారు. జనం రాకతో పరసలో సందడి నెలకొంది. భక్తులకు సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడు పడాల గోవింద్, ఏఐవైఎఫ్ నాయకుడు ఎస్.మధు రెడ్డి ఆధ్వర్యంలో గ్లూకోజ్ పంపిణీ చేశారు.

ప్రజలపై విద్యుత్ భారాలు మోపొద్దు



విద్యుత్ కార్యాలయం ఏఈ శ్వేతకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు



పెదవాల్తేరు విద్యుత్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం వేస్తున్న విద్యుత్ చార్జీల భారాలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆరిలోవ జోన్ నాయకులు శుక్రవారం విమ్స్ ప్రాంగణంలోని విశాలాక్షినగర్ ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. సర్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలు తగ్గించాలని, విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ప్రజలపై వేసిన వివిధ రకాల విద్యుత్ భారాలతోపాటు స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలన్నారు. ఎస్టీ, ఎస్సీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేయాలన్నారు. ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపబోమని ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరుగుతాయన్నారు. అనంతరం విద్యుత్ కార్యాలయంలో ఏఈ శ్వేతకు వినతిపత్రం అందించారు. సీపీఎం నాయకులు పి.మణి, పి.శంకరరావు, డి.నాగరాజు, వి.కాంతం, ఎస్.గౌరి, జి.నాగరాజు, చంద్రమౌళి, సాయి, రాజేష్, ముత్యాలమ్మ, దేవుడమ్మ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

బీచ్‌రోడ్డు: విద్యుత్ చార్జీలను తక్షణం తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఒప్పందాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో పెదవాల్తేరు విద్యుత్ డివిజనల్ ఆఫీస్ వద్ద ధర్నా చేశారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ ట్రూ అప్, సర్దుబాటు చార్జీల పేరిట ప్రజలపై విద్యుత్ భారం మోపడం అన్యాయమన్నారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు పగలగొట్టండని మంత్రి లోకేష్ పిలుపునిచ్చి.. ఇప్పుడు షాపులకు, రైతుల ఇళ్లకు స్మార్ట్ మీటర్లను బిగించడం సరికాదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను, స్మార్ట్ మీటర్లను తక్షణం రద్దు చేయాలని, ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జోన్ కమిటీ సభ్యులు కె.కుమారి, ఎం.చంటి, పార్టీ సీనియర్ నాయకులు జి.వి.ఎం.చలపతి, జి.వి.రమణ, జీవీఎంసీ నాయకులు జి.ఆర్.నాయుడు, ఆర్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బోర్డ్ ట్యాక్స్ పేరుతో బరితెగింపు

జోన్-3 టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై విమర్శలు



పొక్లెయిన్‌తో నేమ్ బోర్డ్ కూల్చేస్తామంటూ బెదిరింపులకు దిగిన జోన్-3 టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

ఎంవీపీకాలనీ: బోర్డ్ ట్యాక్స్ పేరుతో జీవీఎంసీ జోన్-3 టౌన్ ప్లానింగ్ అధికారులు బరితెగింపునకు దిగిన ఘటన ఎంవీపీ కాలనీలో జరిగింది. వివరాలిలా.. ఎంవీపీ కాలనీ సెక్టార్-2లో చాలా కాలంగా జంగిడి మిఠాయ్ షాపు నిర్వహణలో ఉంది. దీనికి ముందుభాగంలో ఉన్న బోర్డ్‌కు ట్యాక్స్ కట్టాలని జోన్-3 టౌన్ ప్లానింగ్ అధికారులు ఉత్తర్వులిచ్చారు. బోర్డ్‌కు టాక్స్‌ను ఏకంగా రూ.89 వేలుగా పేర్కొన్నారు. దీంతో ఆ దుకాణ యజమాని ఉన్నతాధికారులతో మాట్లాడే ఆలోచనలో ఉండగా.. గురువారం ట్యాక్స్ ఇంకా కట్టలేదంటూ జోన్-3 టౌన్ ప్లానింగ్ అధికారులు ఏకంగా బోర్డ్‌ను కూల్చేందుకు పొక్లెయిన్‌తో సహా వెళ్లడం, కూల్చేస్తామని బెదిరించడం చర్చనీయాంశంగా మారింది. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బోర్డ్‌కు ట్యాక్స్‌గా రూ.89 వేలు వేయడమేంటని, దానికి తోడు వెంటనే కట్టకపోతే కూల్చేస్తామని పొక్లెయిన్‌ను తీసుకొచ్చి బెదిరించడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఇది జోన్-3 అధికారుల బరితెగింపునకు నిదర్శనమంటూ మండిపడుతున్నారు. ఈ ఘటనపై టౌన్ ప్లానింగ్ స్థానిక సిబ్బంది వివరణ కోరగా.. ట్యాక్స్ గురువారం చెల్లిస్తామని చెప్పి కట్టనందుకే శుక్రవారం పొక్లెయిన్‌తో వెళ్లి చర్యలు చేపడతామని హెచ్చరించినట్లు తెలిపారు.

గురుదేవోభవ



మనం ఎంత ఎత్తుకు ఎదిగినా మన మూలాలు మర్చిపోకూడదు. భారత ప్రభుత్వ విదేశీ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ వై.ఉమాశంకర్ శుక్రవారం ఆంధ్ర విశ్వవిద్యాలయానికి విచ్చేశారు. న్యాయ కళాశాలలో తనకు పాఠాలు చెప్పిన గురువులకు పాదాభివందనం చేశారు. జాతీయస్థాయిలో ప్రముఖ స్థానంలో ఉన్నప్పటికీ తన గురువులను మర్చిపోకుండా వారికి పాదాభివందనం చేసి నేటితరం విద్యార్థులకు మార్గదర్శకంగా, ఆదర్శంగా నిలిచారు.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

'ది-డెక్' ప్రారంభోత్సవానికి సిద్ధం చేయండి



ది-డెక్ భవనంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: ది-డెక్ మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్ భవనాన్ని త్వరలోనే ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌లు అధికారులను ఆదేశించారు. సిరిపురం జంక్షన్‌లో తుది దశ నిర్మాణంలో ఉన్న ది-డెక్ భవనాన్ని శుక్రవారం వారు సందర్శించి, అన్ని ఫ్లోర్లలో పనులను పరిశీలించారు. పార్కింగ్ కోసం కేటాయించిన ఫ్లోర్‌లో పార్క్‌చేసే విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ భవనం ప్రారంభోత్సవానికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ భవనాన్ని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు కేటాయించడం అభినందనీయమని చైర్మన్ పేర్కొన్నారు. జాయింట్ కమిషనర్ కె.రమేష్, ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు మధుసూదనరావు, రామరాజు, దుర్గా ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.